క్లుప్తంగా

బడుగు వర్గాల సంక్షేమ సారథి సీఎం జగనన్న

తిరుపతి కల్చరల్: నవరత్నాల సంక్షేమ పథకాలతో ప్రజాసంక్షేమానికి బాటలు వేస్తున్న ముఖ్యమంత్రి బడుగు, బలహీనవర్గాల రాజకీయ అభ్యున్నతికి కృషి చేస్తూ వారి సంక్షేమ సారథిగా నిలిచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్‌సీపీ దళిత విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో బడుగు, బలహీనవర్గాల ఓట్లతో అధికారం చేపట్టి వారిని విస్మరించిన చరిత్రగత పాలకులదని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావ్ పూలే వంటి మహనీయుల భావజాలాన్ని అమలు చేస్తూ బలహీన వర్గాల రాజకీయ ఎదుగుదలకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. 18 ఎమ్మెల్సీల సీట్లలో 14 ఎమ్మెల్సీలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అందించడం దేశ చరిత్రలో చారిత్రాత్మక నిర్ణయమన్నారు. వచ్చే 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలిపించేందుకు దళిత, బడుగు, బలహీనవర్గాలు ముందుంటాయని స్పష్టం చేశారు.

తిరుపతి గంగమ్మకు విశేష పూజలు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు చెరువు కట్ట మీద వెలసిన శ్రీ తిరుపతి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చనలు చేపట్టారు. ఫాల్గుణమాసం, శుక్ల పాడ్యమి పర్వదినం పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ఆలయ ధర్మకర్తలు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

భూపరీక్ష టెస్టు పాయింట్ల పరిశీలన



పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలో నూతన భవనాల నిర్మాణానికి పునాదుల ఏర్పాటు విషయమై భూపరీక్ష టెస్టుపాయింట్ల ఎంపిక, ఇతర అంశాలను అధికారులు మంగళవారం పరిశీలించినట్టు తిరుపతి న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు దినకర్ తెలిపారు. శనివారం నుంచి భూసార పరీక్ష పనులను అధికారులు ప్రారంభిస్తారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ సీహెచ్ సుధారాణి, ఆర్అండ్‌బీ అధికారులు భవన నిర్మాణ పర్యవేక్షణ ఏజెన్సీ ఆర్‌వీ కన్‌స్ట్రక్షన్ అండ్ కన్సల్టెంట్ అధిపతి బీఆర్‌నాయుడు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి



విజయలక్ష్మి కుమారున్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : పట్టణంలోని కొర్లగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు విజయలక్ష్మి కుమారుడికి మెరుగైన వైద్యం అందించాలని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి సంబంధిత వైద్యులను ఆదేశించారు. విజయలక్ష్మి కుమారుడు అనారోగ్యంతో స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసి ఎమ్మెల్యే భూమన మంగళవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. అనంతరం వైద్యులను పిలిచి విజయలక్ష్మి కుమారుడి ఆరోగ్యంపై ఆరా తీశారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, జేసీఎస్ అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, మద్దాలి శేఖర్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగికి గాయాలు



పాకాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో టైపిస్ట్‌గా పని చేస్తున్న రామయ్య బైకు అదుపి కింద పడి గాయపడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. మంగళవారం ఉదయం రామయ్య తిరుపతి నుంచి పాకాల ఎంపీడీఓ కార్యాలయానికి స్కూటర్‌పై వెళ్తుండగా నేంద్రగుంట సమీపంలో బైక్ స్కిడ్ కావడంతో కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని తల, కాళ్లకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కి సమాచారం అందించి తిరుపతి రుయాకు తరలించారు.

భగవాన్ రామకృష్ణుల బోధనలు ఆచరణీయం





మాట్లాడుతున్న రామకృష్ణ మిషన్ ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద, భగవాన్ శ్రీరామకృష్ణుల జయంతి సందర్భంగా పూజలు, హోమం చేపడుతున్న ఆశ్రమ పండితులు

తిరుపతి కల్చరల్: యావత్ భక్తకోటిని ఉత్తేజపరిచేలా భగవాన్ శ్రీరామకృష్ణుల వారు అందించిన ధర్మబోధనలు ప్రతిఒక్కరూ ఆదరించి తద్వారా సమాజ శ్రేయస్సుకు దోహదపడాలని రామకృష్ణ మిషన్ ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద పిలుపునిచ్చారు. ఇస్కాన్ మందిరం వద్ద ఉన్న రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో మంగళవారం భగవాన్ శ్రీరాకృష్ణుల 188వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆశ్రమంలో సుప్రభాతం, వేదపారాయణం, ధ్యానం, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం హోమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద స్థాపించిన రామకృష్ణ మఠం, మిషన్‌లు భారతదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించాయని తెలిపారు. భగవాన్ రామకృష్ణులు తన బోధనల ద్వారా కర స్పర్శ ద్వారా భక్తులను ఎంతో ఉత్తేజపరిచారన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్, మహాత్మా గాంధీ వంటి వారు కూడా శ్రీరామకృష్ణుల ద్వారా ప్రేరణ పొందారని తెలిపారు. ఆయన సర్వమత సమన్వయంగా బోధించడంతో పాటు భగవంతుడు ఒక్కరేనని, ఆయనను చేరేందుకు ఎన్నోమార్గాలు, ధర్మాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ ఆశ్రమ ప్రతినిధులు పీసీ రెడ్డి, జయచంద్రారెడ్డి, సుగుణమ్మ, డాక్టర్ జీఎస్ ప్రసాద్, వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఎం మునిరత్నం

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు కట్ట సమీపంలో ఉన్న రాయల మండపంలో మంగళవారం తిరుపతి ఏరియా ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి డీపీఎం మునిరత్నం ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల నూర్పిడి అనంతరం పొలంలో చిరుధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరలు, నూనెగింజలు వంటి బహుళ పంటలను సాగు చేయడం ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ప్రకృతిని సంరక్షించడంలో భాగంగా దేశీయ పశువుల పేడతో పలు రకాల కషాయాలను తయారు చేయడానికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి సహాయంతో రైతులకు దేశీయ ఆవులను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో మాస్టర్ ట్రైనర్ స్వామికొండయ్య, యూనిట్ ఇన్‌చార్జ్‌లు సుమతి, రాజేశ్వరి, ప్రేమ, రాజమ్మ, మహేశ్వరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే వివాహ కానుక' పంపిణీ



వివాహ కానుకను అందజేస్తున్న ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి

చంద్రగిరి: స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అందజేసిన ఎమ్మెల్యే వివాహ కానుకను మంగళవారం నాయకులు అందజేశారు. స్థానిక పాతపేటకు చెందిన లవకుమార్, సునంద, వెంకటేష్, పరమేశ్వరి, దాసరవీధికి చెందిన భరత్ కుమార్, లైలాకు వివాహం నిశ్చమైంది. ఈ సందర్భంగా శుక్రవారం వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి నూతన వధూవరులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పంపించిన బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, మహార్ఘపు పట్టువస్త్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, అమ్మవారి పసుపు-కుంకుమతో కూడిన కానుకను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు దెయ్యాల మాధవరెడ్డి, బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి, సుబ్రత్, నాయకులు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, కోలా అనిల్, ముదికుప్పం రామ్మూర్తి, సక్కూరు వంశీ, బాహర్, కొత్తపాటి హరి, కోలా మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణకు కృషి చేయండి



కాలుష్య నియంత్రణ చర్యలపై ఈఈ నరేంద్రబాబుకు సూచనలిస్తున్న బోర్డు సభ్యులు సురేష్‌కుమార్

తిరుపతి అర్బన్: కాలుష్య నియంత్రణకు కృషి చేయాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి బోర్డు సభ్యులు పాకా సురేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన తిరుపతి నగరంలోని ఏపీ కాలుష్య నియంత్రణ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరేంద్రబాబు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రాంతీయ కార్యాలయంలోని కాలుష్య నియంత్రణ ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం శ్రీసిటీలో ఉన్న పరిశ్రమల పనితీరు, కొత్తగా ఏర్పాటు చేయనున్న పరిశ్రమల వారు కాలుష్య నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలుష్యానికి సంబంధించి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ పర్యావరణ ఇంజినీర్లు మదన్‌మోహన్‌రెడ్డి, కిషోర్ రెడ్డి, సైంటిస్ట్ సుధాకర్, రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ దళిత సంఘ నేత చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ గమనానికి దిక్సూచి కమ్యూనిస్టు ప్రణాళిక



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు

తిరుపతి కల్చరల్: ప్రపంచ గమనానికి దిక్సూచి కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక అని, గడిచిన చరితంత్రా వర్గ పోరాటాలే అని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక వెలువడి 175 ఏళ్ల అయిన సందర్భంగా సోషలిస్టు అధ్యయన కేంద్రంలో మంగళవారం రెడ్‌బుక్ డే సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కార్ల్‌మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ 1848 ఫిబ్రవరి 21న కమ్యూనిస్టు మానిఫెస్టోను ప్రచురించారని, ఇది నాటి నుంచి ప్రపంచ కమ్యూనిస్టులకు దిక్సూచిగా నిలిందన్నారు. గ్రామాల్లో జనాభా పట్టణాలకు వలస పోతారని, పెట్టుబడిదారులు ప్రపంచాన్ని జయిస్తారని, సామ్రాజ్యవాదం ప్రపంచ మానవాళికి ముప్పు కలిగిస్తుందని తద్వారా వర్గ పోరాటాలు నిత్యకృత్యం అవుతాయని మార్క్స్ ఆనాడే హెచ్చరించారని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ మార్క్స్ మహాశయుని ఆశయాలను ముందుకు తీసుకుపోవడానికి సీపీఐ కార్యకర్తలంతా కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికను తప్పక అధ్యయనం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కుమార్‌రెడ్డి, రాధాకృష్ణ, విశ్వనాథ్, నదియా, ఉదయ్, బండి చలపతి, కత్తి రవి కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాప్రస్థానం సామూహిక పఠనం

తిరుపతి కల్చరల్: కమ్యూనిస్టు ప్రణాళిక రచించి 175 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ మార్క్సిస్ట్ ఆధ్వర్యంలో సీపీఎం కార్యాలయంలో మంగళవారం శ్రీశ్రీ రచంచిన మహాప్రస్థానం సామూహిక అధ్యయనం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు మాట్లాడుతూ శ్రీశ్రీ సామాన్యుడి బాధల ఆధారంగా అనేక కవితలు రచించారన్నారు. అందులో 'ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం.. నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం' అంటూ సమాజంలో ఒకరిని ఒకరు దోపిడీ చేయడం తప్ప చరిత్ర ఏముందని ప్రశ్నించారని తెలిపారు. శ్రీశ్రీ తన కవితల ద్వారా సమాజాన్ని మేల్కొలిపారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కందారపు మురళి, సాయిలక్ష్మి, వెంకటరమణ, మునిరాజ,గీత, పద్మ, హేమలత, బాలసుబ్రమణ్యం, బుజ్జి, రాధాక్రిష్ణ, వీఎస్.మణ్యం పాల్గొన్నారు.

చంద్రప్రభ వాహనంపై సర్వేశ్వరుడి చిద్విలాసం



సూర్యప్రభ వాహనంపై దర్శనమిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: మహాశివరాత్రి పురస్కరించుకుని మండల పరిధిలోని తొండవాడ శ్రీఅగస్త్యేశ్వరస్వామివారి(ముక్కోటి) ఆలయంలో స్వామి, అమ్మవార్లు ఉదయం సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి అభిషేక సేవలు చేపట్టి అలంకరించారు. ఉదయం 8 గంటలకు ఆదిదంపతులైన స్వామి, అమ్మవారు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం రాత్రి దివ్యాలంకరణ భూషితులైన స్వామి, అమ్మవారు చంద్రప్రభ వాహనంపై నుంచి భక్తులకు కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథ రెడ్డి, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

సిపాయి సుబ్రమణ్యంకు ఘన సన్మానం



సిపాయి సుబ్రమణ్యంను సన్మానిస్తున్న బీసీ సంఘాల నాయకులు

ఏర్పేడు: మండలంలోని పలువురు బీసీ సంఘాల నాయకులు, వన్నెకుల క్షత్రియ యువజన సేవాసంఘం నాయకుల ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంను ఘనంగా సన్మానించారు. మంగళవారం తిరుపతి రష్ ఆస్పత్రిలో మర్యాద పూర్వకంగా ఆయనను కలిశారు. కార్యక్రమంలో బీసీ సంఘాలు, వన్నెకుల క్షత్రియ యువజన సేవాసంఘం నాయకులు బత్తిశెట్టి, దామోదరంరెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, వినోద్, హనుమంతు, సునీల్ తదితరులు సిపాయిని శాలువలు, పూలమాలలతో సన్మానించారు.

పలువురికి జరిమానా

తిరుపతి లీగల్ : తిరుపతిలో మద్యంతాగి వాహనాలు నడుపుతున్న పలువురికి 12 కేసుల్లో రూ.19 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ శ్రీనివాసులు మంగళవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు 12 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

● టీ టైం!



చాయ్.. చటుక్కున తాగరా భాయ్.. చాయ్ ఖరీదులో చీపురా భాయ్.. చాయ్ కుశలమే చూపురా భాయ్.. అంటూ ఓ సినీ గేయ రచయిత చాయ్(టీ) గురించి అద్భుతంగా వర్ణించాడు. ఈ పాటలోని వర్ణన ఎంత మధురంగా ఉందో.. పాట కూడా అంతే ప్రాచుర్యం పొందింది. నిత్యం ప్రజాసేవలో ఉండే ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మంగళవారం తిరుపతి నడిబొడ్డున నాలుగు కాళ్ల మండపం వద్ద ఓ టీస్టాల్‌లో మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణతో కలిసి తేనీరు సేవించి సేదతీరారు. ప్రజాప్రతినిధిగా ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా.. ఎమ్మెల్యే భూమన నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారితో కలిసి నడవడం, వారిలో ఒకరిగా కలిసిపోతారు. నగర పర్యటనలో భాగంగా సహచరులతో కలిసిన ఎమ్మెల్యే భూమన రోడ్డుపై టీ తాగుతున్న దృశ్యాలను పాదచారులు, వాహనదారులు ఆసక్తిగా తిలకించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

మాతృభాషను కాపాడుకుందాం



తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పిస్తున్న అధ్యాపకులు

పాకాల : ప్రపంచీకరణలో భాగంగా ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొని మాతృభాషను కాపాడుకుందామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. స్థానిక కళాశాలలో మంగళవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరభాషలపై వ్యామోహం తగ్గించుకుని, మాతృభాషపై మమకారం పెంచుకోవాలన్నారు. తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఈశ్వర్‌బాబు మాట్లాడుతూ అమ్మతనం కలబోసిన కమ్మదనపు పరిమళం మాతృభాషలోనే ఉంటుందన్నారు. మాతృభాష బాగా వస్తేనే ఇతర భాషలను బాగా నేర్చుకోవచ్చన్నారు. నిత్య వ్యవహారంలో వినియోగానికి తెలుగు పదాలు ఉన్నా, చాలామంది ఆంగ్ల పదాలను మాట్లాడుతూ భాషను కలుషితం చేస్తున్నారన్నారు. అనంతరం తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్‌కుమార్, చిట్టికళావతి, రమణమ్మ, రాజేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచారం కేసులో ముగ్గురికి రిమాండ్

తిరుపతి లీగల్ : ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న కేసులో ముగ్గురికి మార్చి 7వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత మంగళవారం ఆదేశాలు జారీచేశారు. తిరుపతి రూరల్, గాంధీపురం పంచాయతీ, ధనలక్ష్మీనగర్‌లోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న కేసులో నిర్వాహకులు రుద్రవరం భారతి, రుద్రవరం ప్రశాంత్, తిరుపతి రూరల్ బ్రాహ్మణపట్టుకు చెందిన జి.ఉమామహేష్‌ని ఎమ్మార్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. మూడవ నిందితుడుగా ఉన్న ఉమామహేష్‌కు వ్యక్తిగత పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

చోరీ కేసులో ముగ్గురికి రిమాండ్

ఓ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి బంగారు నగలు, వెండి వస్తువులు, సొమ్ము అపహరించుకెళ్లిన కేసులో తిరుపతి రూరల్ పుదిపట్ల లక్ష్మీపురానికి చెందిన షేక్‌సంపత్, తిరుపతి విద్యానగర్ కాలనీకి చెందిన బాణాల జగదీష్, చంద్రగిరి భారతీనగర్‌కు చెందిన జంగం సత్యను గత ఏడాది సెప్టెంబర్ 5వ తేదీ తిరుపతి రూరల్ చిగురువాడ నార్త్‌కండ్రిగ భూపాల్ ఎస్టేట్‌లోని ఓ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి 90 గ్రాముల బంగారు నగలు, 500 గ్రాముల వెండి వస్తువులు, రూ.2.25 లక్షల నగదును తీసుకుని పరారయ్యాడు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు ఎమ్మార్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. తిరుపతి సీసీఎస్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి ముగ్గురినీ అరెస్టు చేసి స్థానిక ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ముగ్గురికి 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీచేశారు.

11 మందికి ఆరునెలల జైలు

తిరుపతి లీగల్ : అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించిన కేసులో 11 మందికి ఆరునెలలు జైలు శిక్ష, ఒక్కో మనిషికి రూ.1000 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రెండో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు మంగళవారం తీర్పు చెప్పారు. కోర్టు కానిస్టేబుల్ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి గిరిధరదాసు లేన్‌కు చెందిన సుబ్బన్న అనే వ్యక్తి 1997 ఆగస్టు 28న అతని పిల్లలతో కలసి తన 8 అంకణాల స్థలాన్ని తిరుపతి భవానీ నగర్‌కు చెందిన బి.నందగోపాల్ వద్ద తనఖా పెట్టి రూ.లక్ష అప్పుగా తీసుకుని తనఖా పత్రం రిజిస్టర్ చేయించాడు. అలాగే మరో 8 అంకణాల స్థలాన్ని నందగోపాల్ వద్ద రూ.లక్ష అప్పుగా తీసుకుని తనఖా పత్రాన్ని అతని భార్య నాగలక్ష్మి పేరిట రాసుకున్నారు. అయితే సుబ్బన్న, అతని పిల్లలు వారికి సొమ్ము తిరిగి చెల్లించకపోవడంతో నందగోపాల్ తిరుపతి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రెండు సివిల్ దావాలు దాఖలు చేసి డిక్రీ పొందాడు. 16 అంకణాల ఇంటిని కోర్టు ద్వారా వేలంపాడి అతనే తీసుకున్నాడు. 2014 జూన్ 10వ తేదీన ఆ ఇంటిని నందగోపాల్ స్వాధీనం చేసుకుని పనుల మీద హైదరాబాద్‌కు వెళ్లాడు. 2014 జూలై 29న ఇంటి తాళాలను పగులగొట్టి సుబ్బన్న, అతని పిల్లలు తిరుపతి గిరిధర్‌దాస్ లేన్‌కు చెందిన కె.నాగభూషణం రెడ్డి, ఆర్ఎస్ మాడవీధికి చెందిన పి.ప్రభాకర్, గిరిధర్‌దాస్‌కు చెందిన బి.వెంకటసుబ్బమ్మ, బి.విజయ, బి.సుజాత, బి.రాజేశ్వరి, బి.రమణ అలియాస్ వెంకటరమణ, ఏర్పేడు మండలం సీతారామ్‌పేట మర్రిగుంటకు చెందిన బి.నాగరత్నమ్మ అలియాస్ బి.నాగరత్నమ్మ, బాలకృష్ణయాదవ్, బి.సరస్వతి, తిరుపతి సంజీవి నగర్‌కు చెందిన తాళ్లూరు శ్రీనివాసులు అక్రమంగా ప్రవేశించి అతన్ని బెదిరించారు. దీంతో నందగోపాల్ ఈస్టు పోలీసులకు వారిపై ఫిర్యాదు చేశాడు. పోలీసులు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి 11 మందిపై నేరం రుజువు కావడంతో వారికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

వైద్యో నారాయణో హరి..!



రాయలసీమకే తలమానికంగా నిలిచి పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్న తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి వైద్యం కోసం విచ్చేసిన రోగులతో మంగళవారం ఎమర్జెన్సీ వార్డు కిటకిటలాడింది. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న స్విమ్స్ ఆస్పత్రిలో సదుపాయాలతో పాటు మెరుగైన వైద్యసౌకర్యాలు లభిస్తున్నాయి. దీంతో రాయలసీమ జిల్లాల్లోని ప్రజలు నిత్యం స్విమ్స్‌కు వస్తున్నారు. మంగళవారం స్విమ్స్ ఎమర్జెన్సీ వార్డులో రోగులు, వారి సహాయకులు భారీగా కనిపించడంతో సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

- సాక్షి, ఫొటోగ్రాఫర్, తిరుపతి